ప్రసంగం కాదు.. విధ్వంసం

గవర్నర్ ప్రసంగమా? రాజకీయ ప్రసంగమా?

శాసనసభ చరిత్రలోనే ఇలాంటి ప్రసంగం లేదు
50 ఏండ్ల కాంగ్రెస్ దురాగతాలను బరాబర్ చెప్తం
ఇందిరమ్మ రాజ్యమంటే ఆకలి చావులు, ఎన్‌కౌంటర్లే
తెలంగాణ దాస్య శృంఖలాలు తెంచిన కొడుకు కేసీఆర్
ఢిల్లీని మేనేజ్ చేసి పీసీసీ, సీఎం పదవి తెచ్చుకున్నదెవరు?
పంటల బీమాకు, రైతుబీమాకు తేడా తెలియని వ్యక్తి సీఎం!
అప్పులే ఎందుకు? ఆస్తుల గురించి ఎందుకు చెప్పరు?
నామినేటెడ్ వ్యక్తులు పాలకులైతే పరిస్థితి ఇలాగే ఉంటది
ఎన్నో హామీలిచ్చారు.. అన్నీ అమలు చేయాలి
లేదంటే ప్రజల తరపున గొంతు విప్పుతాం
అసెంబ్లీలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీలో గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ చేసిన ప్రసంగం పూర్తిగా రాజకీయ ప్రసంగంలా ఉన్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు విమర్శించారు. శాసనసభ చరిత్రలోనే అలాంటి విధ్వంస ప్రసంగం ఎప్పుడూ లేదని నిప్పులు చెరిగారు. 50 ఏండ్ల కాంగ్రెస్ దురాగాతాలను బరాబర్ చెప్తామని స్పష్టంచేశారు. ఇందిరమ్మ రాజ్యం అంటే గంజి కేంద్రాలు, ఆకలి చావులు, ఎన్‌కౌంటర్లేనని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వం సృష్టించిన ఆస్తుల వివరాలను చెప్పకుండా, కేవలం అప్పుల గురించే కాంగ్రెస్ ప్రభుత్వం చెప్తున్నదని ఆరోపించారు. ఆ సాకుతో ఆ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలును అటకెక్కించాలని చూస్తున్నదని విమర్శించారు. ప్రభుత్వం హామీలను అమలు చేయకుంటే ప్రజల తరపున అసెంబ్లీలో తాము గొంతు విప్పుతామని స్పష్టంచేశారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై శాసనసభలో కేటీఆర్ శనివారం మాట్లాడారు. గవర్నర్ ప్రసంగం పూర్తిగా అసత్యాలు, అభూతకల్పనలతో ఉన్నదని ఆరోపించారు. అ ప్రసంగాన్ని చూసి ఒక శాసన సభ్యుడిగా సిగ్గుపడుతున్నానని అన్నారు.

> ఢిల్లీని మేనేజ్ చేసి సీఎం పదవి, పీసీసీ పదవి తెచ్చుకున్న వ్యక్తి ఈ రోజు మేనేజ్‌మెంట్ కోటా గురించి మాట్లాడితే ఎలా?
> - కేటీఆర్

కాంగ్రెస్ పాపాలను బరాబర్ చెప్తాం..

తాము ఎక్కడ ఉన్నా ప్రజాపక్షమేనని, తెలంగాణకు ఎన్నటికీ స్వపక్షమేనని, ప్రజల తరుపున గొంతు విప్పుతామని కేటీఆర్ ఉద్ఘాటించారు. 2014కు ముందు కాంగ్రెస్ పార్టీ పరిపాలన ఏ విధంగా ఉండేదో చెప్పాల్సిన బాధ్యత తమపై ఉన్నదని అన్నారు. 'పడావు పడ్డ భూములు.. పాడుపడ్డ ఇండ్లు.. ఆకలి కేకలు.. ఆత్మహత్యలు.. వలసలు, కరువులు.. కర్ఫ్యూలు, ఎన్‌కౌంటర్లు.. కరెంట్ కోతలు, కటిక చీకట్లు.. నెర్రెలుబారిన నేలలు, నెత్తురు పారిన భూములు.. ఘనత వహించిన కాంగ్రెస్ ప్రభుత్వంలో నాడు చూపించిన అద్భుతాలు ఇవే కదా?' అని ఎద్దేవా చేశారు. నల్లగొండలో ఫ్లోరైడ్ బాధలు, దేవరకొండలో పసిపిల్లల అమ్మకాలు, పాతబస్తీలో మైనార్టీ బాలికల వివాహాలు, మహబూబ్‌నగర్‌లో గంజి కేంద్రాలు, పాలమూరు వలసలపై ఒక్కసారైనా ఒక్క కాంగ్రెస్ సభ్యుడైనా మాట్లాడారా? అని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్ నుంచి ముంబై ప్రతిరోజు 2 బస్సులు వెళ్లేవని గుర్తు చేశారు. 'అసెంబ్లీ మొదటి రోజునే ఇంత ఉలిక్కిపడితే ఎలా? ఒక్కొక్క మంత్రి లేచి ఉలిక్కిపడి మాట్లాడుతున్నారు. అంత భయమెందుకు? భట్టి విక్రమార్క నిర్మాణాత్మక సూచనలు చేయాలన్నారు. కానీ గవర్నర్ ప్రసంగం నిర్మాణాత్మకంగా ఉంటే, విధ్వంసంగా ఉండకపోయుంటే మేము ఇదంతా చెప్పేవాళ్లం కాదు' అని పేర్కొన్నారు. తెలంగాణలో ప్రాజెక్టులు కట్టకపోయినా, తెలంగాణ పైసల్ని, నీళ్లను ఆంధ్రాకు తరలించుకుపోయినా మౌనంగా మంగళహారతులు పట్టింది కాంగ్రెస్ నాయకులు కాదా? అని ప్రశ్నించారు. నాడు తామంతా తెలంగాణ కోసం పదవులకు రాజీనామాలు చేస్తుంటే.. పదవులు కోసం పెదవులు మూసుకున్నదెవరు? అని నిలదీశారు. కాంగ్రెస్ నేతలు రాజశేఖర్‌రెడ్డిని, కిరణ్‌కుమార్ రెడ్డిని గుర్తు చేసుకున్నప్పుడు తాము కూడా అన్ని విషయాలు చెప్పాల్సిన అవసరం ఉంటుందని స్పష్టంచేశారు. 'తెలంగాణ ఉద్యమాన్ని అణగదొక్కింది ఎవరు? శ్రీకాంతాచారి, యాదిరెడ్డి, యాదయ్య తదితర వందలమంది ప్రాణాలను తీసుకున్నది ఎవరు? బలిదేవత ఎవరు? అనేది ప్రజలకు తెలుసు. ఆ మాట ఎవరన్నారో కూడా తెలుసు. ప్రజలే సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటారు' అని పేర్కొన్నారు.

దాస్య శృంఖలాలు తెంచిన కొడుకు కేసీఆర్..

'చరిత్ర దాస్తే దాగేది కాదు. ప్రగతిభవన్‌లో శిలాఫలకంపై కేసీఆర్ పేరుపై మట్టి పూయగానే చరిత్ర మరుగునపడిపోదు. వాస్తవం ఏంటంటే.. 50 ఏండ్ల గోస తర్వాత తెలంగాణకు కలిసొచ్చే కాలానికి నడిసొచ్చిన కొడుకు కేసీఆర్. తెలంగాణ తల్లి దాస్య శృంఖలాలు తెంచిన కొడుకు కేసీఆర్. గవర్నర్ తన ప్రసంగంలో మార్పు మొదలైంది.. నిర్భందం పోయింది అన్నారు. నిజమే.. 2014 జూన్ 2న దాస్య శృంఖలాల నుంచి తెలంగాణకు విముక్తి లభించింది. ఆ రోజునే నిర్బంధం పోయింది. బానిసకొక బానిసకొక బానిస అని శ్రీశ్రీ అన్నట్టు గతంలో మనల్ని పీడించిన వాళ్లు పోయినా.. వాళ్ల పేర్లు తలుచుకునే వారు ఇంకా ఇక్కడే ఉన్నారు' కేటీఆర్ నిప్పులు చెరిగారు.

తెలంగాణ ప్రగతిఖ్యాతి కేసీఆర్‌దే..

తెలంగాణను అన్ని రంగాల్లో ప్రగతిపథంలో నిలిపిన ఖ్యాతి కేసీఆర్‌దేనని కేటీఆర్ స్పష్టంచే

> ఎన్ఆర్ఐలకు టికెట్లు అమ్ముకున్నది ఎవరు? 100 కోట్ల భారతీయులను కాదని, బయటి దేశం వాళ్లను అధ్యక్షులుగా చేసుకున్న కాంగ్రెస్ పార్టీ ఎన్ఆర్ఐల గురించి మాట్లాడితే ఎలా?
> - కేటీఆర్

శారు. వలసలను నివారించారని, నల్లగొండను ఫ్లోరోసిస్ రహిత జిల్లాగా తీర్చిదిద్దారని, ఉరిసిల్లగా పేరుమోసిన సిరిసిల్లను సిరిశాలగా చేశారని, కునారిల్లిపోయిన కుల వృత్తులకు కొత్త ఊపిరిలూదారని, సంక్షేమంలో స్వర్ణయుగం సృష్టించారని కొనియాడారు. 'పల్లెప్రగతిని చేసి చూపెట్టాం. గత పదేండ్లలో రక్తాన్ని రంగరించినం..మెదళ్లను కరిగించినం.. ప్రాణం పెట్టి పనిచేసినం.. కాబట్టే ఇవాళ ఒక్కొక్క రంగంలో భారతదేశంలోనే తెలంగాణ అగ్రగామిగా ఉన్నది' అని తేల్చి చెప్పారు.

> పంటల బీమాకు, రైతుబీమాకు తేడా తెలియని వ్యక్తి సీఎంగా ఉన్నందుకు నిజంగానే సిగ్గుపడుతున్నా.
> - కేటీఆర్

హామీలన్ని అమలు చేస్తే స్వాగతిస్తాం..

సర్పంచ్‌లకు నిధులు ఇస్తాం, మాజీలకు అది ఇస్తాం, బస్సు ఫ్రీ, బంగారం ఫ్రీ, బండి ఫ్రీ అని ఓట్ల కోసం కాంగ్రెస్ నాయకులు చాలా చెప్పారని, మ్యానిఫెస్టోలోని ప్రతి హామీని నిలబెట్టుకోవాలని, అలా చేస్తే తాము కూడా స్వాగతిస్తామని కేటీఆర్ అన్నారు. 'ఇచ్చిన 6 గ్యారెంటీల్లో రెండు ఇప్పటికే అమలు చేశామని గవర్నర్ ప్రసంగంలో చెప్పారు. అది అవాస్తం.. ప్రజలను మభ్య పెట్టడమే. సూపర్ లగ్జరీ బస్సుల్లో కూడా ఉచిత ప్రయాణం అని చెప్పి నేడు పల్లె వెలుగు, సిటీ బస్సులు, ఆర్డినరీ, ఎక్స్ ప్రెస్‌లకే పరిమితం చేశారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ఇప్పటికే అమలులో ఉన్నది. మహాలక్ష్మి పథకం కింద ప్రతినెలా మహిళలకు రూ.2500, రూ.500లకే వంట గ్యాస్ సిలిండర్, చేయూత పథకం కింద రూ.4 వేల పింఛన్ తదితర గ్యారెంటీల కోసం ఆడబిడ్డలు, పింఛన్‌దారులు, రేషన్‌కార్డు దారులు ఎదురుచూస్తున్నారు. హామీ ఇచ్చినట్టు 100 రోజుల్లో వాటిని పూర్తి చేస్తారా? చేయరా? అనేది చూస్తాం. ఇస్తే స్వాగతిస్తాం' అని చెప్పారు. ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభించామంటున్నారని, కానీ ఎప్పటి నుంచో ప్రతి సోమవారం కలెక్టర్ ఆఫీసుల్లో అది కొనసాగుతూనే ఉన్నదని గుర్తుచేశారు. సీఎం క్యాంపు ఆఫీస్ వద్ద ఇనుప కంచెలు 2012లో వేసిందే కాంగ్రెస్ ప్రభుత్వమని, వాటిని మళ్లా వాళ్లే తీసేసి.. కంచెలు తీసేశామని బిల్డప్ ఇస్తున్నారని విమర్శించారు. మెగా డీఎస్సీ, రూ.2 లక్షల రుణమాఫీ, కౌలు రైతులకు బీమా, రుణాలు, ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం, బీసీలు, మైనార్టీలకు సబ్‌ప్లాన్, ఎంబీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ తదితర వాగ్దానాలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే తప్పకుండా ప్రజల పక్షాన అసెంబ్లీలో గొంతెత్తుతామని స్పష్టంచేశారు.

అప్పులు సరే.. ఆస్తుల సంగతి చెప్పరెందుకు?

విద్యుత్తు రంగం, పౌరసరఫరాలు తదితర శాఖలు అప్పుల కుప్పగా మారాయన్న ప్రభుత్వ వాదనను కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. 'ఇవాళ కొత్తగా శ్వేతపత్రాలు ఇవ్వడమేంటి. మేమే కోకొల్లలుగా విడుదల చేశాం. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా అన్ని శాఖల శ్వేత పత్రాలను ప్రచురించాం. తిమ్మిని బమ్మిని చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. కాంగ్రెస్ పాలనలో విద్యుత్తురంగం ఎట్లా ఉన్నదనేది అందరికీ తెలుసు. 2009-13 మధ్య నాలుగేండ్లలోనే 8,198 మంది రైతులు కరెంటు షాక్‌తో చనిపోయారు. పరిశ్రమలకు పవర్‌హాలిడేలే. రైతులకు ఐదారు గంటలకు మించి కరెంటు ఇవ్వలేదు. విద్యుత్తు సంస్థలను అప్పులపాలు చేశామని చెప్తున్నారు. కానీ మేం సృష్టించిన ఆస్తుల గురించి మాత్రం చెప్పలేదు. ఉద్దేశపూర్వకంగా మమ్మల్ని బద్నాం చేయడానికి, ఆరు గ్యారెంటీలను ఎగ్గొట్టేందుకు ఒక ఉపోద్ఘాతాన్ని రూపొందించారు. కాంగ్రెస్ అప్పజెప్పిన నాడు విద్యుత్తు శాఖ అత్యంత దురవస్థలో ఉన్నది. 2700 మెగావాట్ల కరెంటు లోటు ఉన్నది. రూ.22,423 కోట్లు అప్పులున్నాయి. ప్రస్తుతం ట్రాన్స్‌కో ఆస్తులు రూ.24,476 కోట్లు. జెన్‌కో ఆస్తులు 2014లో రూ.19,607 కోట్లుంటే నేడు రూ.53,963 కోట్లు. విద్యుత్తు ప్లాంట్లు కట్టడం తప్పా? 19 వేల మెగావాట్లకు చేర్చడం తప్పా?' అని కేటీఆర్ నిలదీశారు. వ్య వసాయ మోటర్ల కనెక్షన్లు 19 లక్షల నుంచి 29 లక్షలకు పెరిగాయని, రైతులకు ఉచితంగా 24 గంటల విద్యుత్తు ఇవ్వడానికి నెలకు వెయ్యి కోట్ల

> మీరు విద్యుత్తు సంస్థల అప్పుల లెక్క చెప్పిస్రు.. నేను ఆస్తుల లెక్క చెప్త.. 81,516 కోట్ల అప్ప చేసి పోయిన్రని అన్నరు.. కానీ, కేసీఆర్ ప్రభుత్వం, తెలంగాణ ఏర్పడిన తర్వాత సృష్టించిన ఆస్తుల గురించి చెప్పలేదు.. బద్నాం చేయడానికి, బట్టకాల్చి మీద వేయడానికి, అప్పుల సాకు చెప్పి, ఆరు గ్యారెంటీలు ఎగ్గొట్టడానికి.. ఒక ఉపోద్ఘాతాన్ని రూపొందించి, ఇగో అప్పుల పాలైపోయింది.. దివాలా తీసింది.. అని చెప్పి, తప్పించుకోవడమే తప్ప ఇంకోటి కాదు.. ఆ రోజు కాంగ్రెస్ మాకు రాష్ట్రం అప్పజెప్పిపోయిన ఆస్తులు చూస్తే, 59,132 కోట్లు.. మా ప్రభుత్వం సృష్టించిన ఆస్తులు కలిపితే లక్షా 37 వేల 571 కోట్ల రూపాయలు. ఆస్తులను మాత్రం చూపెట్టకుండా, అప్పులు మాత్రమే చూపెట్టి.. తిమ్మిని బమ్మి చేసి, ఏదో బుకాయించి.. ఏదో చేస్తం.. జాదూగర్ చేస్తం అంటే కుదరదు.
> - కేటీఆర్

చొప్పున ఏటా రూ.12 వేలకోట్లు ఖర్చుచేశామని చెప్పారు. 10 ఏండ్లలో ఒక్క సంవత్సరం కూడా క్రాప్ హాలిడే ఇవ్వకుండా నడిపిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. ఉచిత విద్యుత్తును ఊడగొట్టే పన్నాగాన్ని ప్రతిఘటిస్తామని స్పష్టం చేశారు. పౌరసరఫరాల శాఖలో రూ.56 వేల కోట్ల అప్పులని చెప్తున్నారని.. కానీ, ప్రస్తుతం రూ.30వేల కోట్ల విలువ చేసే ధాన్యం ఉన్నదని, రూ.17 వేల కోట్లు రావాల్సిన నిధులు ఉన్నాయని వెల్లడించారు.

అప్పుచేసి పప్పు బెల్లాలు పంచలేదు

బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పులు చేసి ఆస్తుల సృష్టికి పెట్టుబడి పెట్టిందని, అందుకు కేంద్రప్రభుత్వ సంస్థలు, ఆర్‌బీఐ తదితర సంస్థల నివేదికలు నిదర్శమని కేటీఆర్ తెలిపారు. అప్పులు చేసి పప్పుబెల్లాలు పంచలేదని స్పష్టంచేశారు. అమెరికా జీడీపీలో అప్పులు 123 శాతం, భారత్‌దేశానివి 57 శాతం, తెలంగాణవి 27.08 శాతం మాత్రమేననిని వివరించారు. అయినా లేనిది ఉన్నట్టు, ఉన్నది లేనట్టు మాట్లాడుతున్నారని విమర్శించారు. వడ్డీల భారం కూడా చాలా తక్కువని, రాష్ట్ర సొంత పన్ను ఆదాయం గతంలో 76 శాతం ఉంటే.. నేడు అది 84.2 శాతానికి పెరిగిందని తెలిపారు. సచివాలయం, ప్రగతిభవన్, కలెక్టరేట్లు, కమాండ్ సెంటర్లు, అండర్‌పాస్‌లు, యాదాద్రి ఆలయం నుంచి అంబేద్కర్ సచివాలయం వరకు కట్టిందే కేసీఆర్ ప్రభుత్వమని.. అది అప్పా? పెట్టుబడా? ఆలోచించాలని కోరారు.

ఫార్మాసిటీ రద్దును పునఃసమీక్షించుకోండి..

కాంగ్రెస్ ప్రభుత్వం తిరోగమన నిర్ణయాలు తీసుకుంటే వ్యతిరేకిస్తామని కేటీఆర్ హెచ్చరించారు. ఫార్మాసిటీని సీఎం రేవంత్‌రెడ్డి రద్దు చేస్తామని ప్రకటించినట్టు విన్నామని, అది రాష్ట్రానికి మంచిది కాదని, ఆ నిర్ణయాన్ని పునరాలోచించాలని సూచించారు. ఢిల్లీ, కర్ణాటక నుంచి రిమోట్ కంట్రోల్ చేయాలని చూస్తే సహించబోమని తేల్చిచెప్పారు. ప్రజా కవి కాళోజీ కవిత 'ప్రాంతేతరుడు ద్రోహం చేస్తే పొలిమేరలకు తరిమికొడతాం. ప్రాంతంవాడు ద్రోహం చేస్తే ప్రాంతంలోనే పాతరపెడతాం' అని ఈ సందర్భంగా ఉటంకించారు.

● **దారి చూపే ఈ-ట్రాలీ**

విదేశీ తరహా ఆధునిక టెక్నాలజీ వినియోగంలో శంషాబాద్ ఎయిర్‌పోర్టు ముందు వరుసలో నిలిచింది. ఇప్పటికే అత్యున్నత ప్రమాణాలతో విమానయాన సేవలు అందిస్తున్న జీఎంఆర్ శంషాబాద్ ఎయిర్‌పోర్టు తాజాగా టెక్నాలజీ ఆధారిత యంత్రాన్ని ప్రయాణికులను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఎయిర్‌పోర్టు ప్రాంగణంలో ఉన్న సేవలు, ప్రత్యేక మార్గాలను చూపించే మోడ్రన్ మ్యాపింగ్‌తో కూడిన ఈ ట్రాలీలు ప్రయాణికులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి.
– హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ

చేనేత, జౌళి రంగాలకు పూర్వవైభవం

● **చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

హైదరాబాద్, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ): చేనేత, జౌళి రంగాలకు పూర్వవైభవం తెచ్చేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఆయా శాఖల అధికారులతో శనివారం జరిగిన సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడారు. ప్రభుత్వ పథకాలకు సకాలంలో నిధులు విడుదల చేయాలని, కేంద్రం నుంచి అందాల్సిన నిధులను రాబట్టేలా కృషి చేయాలని, చేనేత పరిశ్రమలకు భారీగా పెట్టుబడులు వచ్చేలా చొరవ తీసుకోవాలని ఆదేశించారు. చేనేత డిజైనింగ్, శిక్షణ, ఉత్పత్తి, మార్కెటింగ్ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పోచంపల్లి, గద్వాలలోని చేనేత పరిశ్రమల వివరాలతో కూడిన నివేదికను తనకు అందించాలని కోరారు. వరంగల్ టెక్స్‌టైల్ పార్క్‌ను గ్రీన్‌పార్క్‌గా తీర్చిదిద్దేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు.

పక్షులతో ఎయిర్‌పోర్టుల్లో ప్రమాదాలు

- **నివేదిక విడుదల చేసిన కేంద్ర ఏవియేషన్ మంత్రిత్వ శాఖ**
- **ఆర్‌జీఐఏలో ఐదేండ్లలో 183 బర్డ్ స్ట్రయిక్స్ జరిగినట్టు వెల్లడి**

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 16(నమస్తే తెలంగాణ): విమానాశ్రయాల్లో పక్షులతో సంభవించే ప్రమాదాల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నదని, 2018 నుంచి 2023 వరకు ఆర్‌జీఐఏ ఎయిర్‌పోర్టులో 183 బర్డ్ స్ట్రయిక్స్ జరిగినట్టుగా కేంద్రమంత్రి వీకే సింగ్ రాజ్యసభలో పేర్కొన్నారు. 2018లో 27, 2019లో 16, 2020లో 34, 2021లో 29, 2022లో 39, 2023లో 38 ప్రమాదాలు జరిగినట్టు వివరించారు. దేశంలోని అన్ని ఎయిర్‌పోర్టులలో పక్షుల కారణంగా జరిగిన ప్రమాదాలపై శనివారం ఆయన ఓ నివేదికను వెల్లడించారు. ఇందులో ఈ ఏడాది కాలంలో ఢిల్లీ ఎయిర్‌పోర్టులో(169), మహారాష్ట్ర(131), గుజరాత్(114), కేరళ(92) ప్రమాదాలు జరిగినట్టు స్పష్టం చేశారు. కాగా సివిల్ ఏవియేషన్ నిబంధనల ప్రకారం ఎయిర్‌పోర్టుకు ఒక కిలోమీటర్ పరిధిలో పక్షులు, జంతువుల సంచారాన్ని నియంత్రించాల్సి ఉందని, పక్షులతో కలిగే ప్రమాదంతో విమానాలకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని ఆ నివేదికలో పేర్కొన్నారు.

టీ వర్క్స్‌లో ఉత్సాహంగా మేకర్ ఫెయిర్

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ టీ వర్క్స్‌లో శనివారం మేకర్ ఫెయిర్ అట్టహాసంగా ప్రారంభమైంది. దేశంలో అతి పెద్ద భౌతిక వస్తువుల నమూనాల తయారీ కేంద్రంగా గుర్తింపు పొందిన టీ వర్క్స్‌లో త్రీడీ ప్రింటింగ్, కుండల తయారీ, రోబోటిక్స్, ఎలక్ట్రానిక్స్.. ఇలా రకరకాల అంశాల్లో సరికొత్త ఆవిష్కరణలు రూపొందించే వారిని ఒకే వేదిక పైకి తీసుకువచ్చే కార్యక్రమాన్ని టీ వర్క్స్ చేపట్టింది. దేశంలోనే ఎంతో ప్రతిష్ఠాత్మక కార్యక్రమంగా నిర్వహిస్తున్న మేకర్ ఫెయిర్‌లో 500 మందికిపైగా ఔత్సాహిక తయారీదారులు పాల్గొని వివిధ అంశాల్లో కొత్త వస్తువుల నమూనాలను రూపొందించినట్టు టీ వర్క్స్ ప్రతినిధి వీర చప్పీ తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో ఎన్నో ఆవిష్కరణలకు కేంద్రంగా నిలుస్తున్నదని, తెలంగాణ నుంచే కాకుండా దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి వేలాది మంది ఇందులో పాల్గొంటున్నారని ఆయన తెలిపారు. ఆదివారం కూడా ఈ ఫెయిర్ ఉంటుందని, కొత్త వస్తువుల తయారీపై ఔత్సాహికులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తామని ఆయన పేర్కొన్నారు.

రేవంత్ ఐపీఎస్ ఆఫీసరేం కాదు!

- **మంత్రులు కానిస్టేబుళ్లు, హోంగార్డులు కాదు**
- **రేవంత్‌కి పాలన అనుభవం తక్కువే**
- **సీఎం దూకుడు తగ్గించుకోవాలి**
- **కాంగ్రెస్‌కు వందరోజుల సమయమిస్తున్నాం**
- **ప్రజావాణి.. పబ్లిసిటీ షో కావొద్దు**
- **అసెంబ్లీలో నిర్మల్ బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి**

హైదరాబాద్, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ): 'రేవంత్‌రెడ్డి ఐపీఎస్ ఆఫీసరేం కాదు.. మంత్రులంతా కానిస్టేబుళ్లు.. హోంగార్డులు కాదు. ప్రభుత్వంలో అనేకమంది సీనియర్ మంత్రులున్నారు.. వారి సూచనలు, సలహాలు తీసుకోవాలి' అని నిర్మల్ బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యావాదాలు తెలిపే తీర్మానంపై శనివారం ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డికి పాలనా అనుభవం లేకపోయినా ముఖ్యమంత్రి అయ్యారని, ఆయన దూకుడు తగ్గించుకొని సమయస్ఫూర్తితో వ్యవహరిస్తూ రాష్ట్రాన్ని కాపాడాలని కోరారు. గతంలో సీఎం అభ్యర్థి ఎప్పుడూ ఓడిపోలేదని.. ఒక స్థానంలో ఓడిపోయినా రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల గురించి తప్ప మిగిలిన 412 హామీల గురించి మాట్లాడటం లేదని మండిపడ్డారు. 420 హామీలకు 8 హామీలు మాత్రమే తక్కువగా ఉన్నాయని, ఇన్ని హామీలిచ్చినా కాంగ్రెస్‌కు ప్రజలు బొటాబొటి మెజార్టీనే ఇచ్చారని, ఆరు గ్యారెంటీల గురించే పదేపదే మాట్లాడటం సరికాదని అన్నారు. ప్రజావాణి.. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కావాలే తప్ప.. పబ్లిసిటీ షో కాకూడదని సూచించారు. ప్రతిరోజూ ప్రజాదర్బార్ ఉంటుందని చెప్పి.. ఇప్పుడు వారానికి రెండు రోజులు మాత్రమే నడుపుతున్నారని అన్నారు. ఎమ్మెల్యేలు సైతం ప్రజాదర్బార్‌ను నిర్వహిస్తామని గతంలో ప్రకటించారని, ఇవన్నీ ప్రకటనలకే పరిమితమయ్యాయని తెలిపారు. అప్పుల కుప్ప అని చెప్పి హామీల అమలు నుంచి తప్పించుకుందామనుకుంటున్నారా? అంటూ మహేశ్వర్‌రెడ్డి ప్రశ్నించారు. కొత్త అప్పులతో పన్నుల భారాన్ని ప్రజలపై మోపరాదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వానికి వంద రోజుల సమయమిస్తున్నామని, బడ్జెట్ సమయంలో ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు.

పొన్నం వర్సెస్ మహేశ్వర్‌రెడ్డి

అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రసంగం సమయంలో మంత్రి పొన్నం ప్రభాకర్, బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి మధ్య స్వల్ప సంవాదం జరిగింది. గవర్నర్ ప్రసంగంలో సోనియాగాంధీ వల్లే తెలంగాణ సాధ్యమైందని ప్రకటించారని, బీజేపీ.. సుష్మాస్వరాజ్ మద్దతుతోనే తెలంగాణ ఏర్పాటైన విషయాన్ని విస్మరించరాదని మహేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. సకల జనులంతా కొట్లాడి రాష్ట్రాన్ని సాధించుకొన్నారని, కానీ కేవలం సోనియా వల్లే సాధ్యమైందనడం అత్యంత బాధాకరమని అన్నారు. దీనిపై కల్పించుకొన్న మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రధానమంత్రి మోదీ పలుమార్లు తెలంగాణను, రాష్ట్ర ప్రజలను దారుణంగా అవమానించారని, తల్లిని చంపి బిడ్డను బతికించారని, తలుపులు మూసి రాష్ట్రాన్ని విభజించారని మాట్లాడారని ఎదురుదాడికి దిగారు.

ఫోన్ల రికవరీలో తెలంగాణ టాప్

- **239 రోజుల్లో 15 వేలకు పైగా ఫోన్ల అందజేత**
- **33 శాతం రికవరీ రేటుతో దేశంలోనే అగ్రస్థానం**
- **తర్వాతి స్థానాల్లో కర్ణాటక, ఏపీ**

హైదరాబాద్, డిసెంబర్ 16 (నమస్తే తెలంగాణ): చోరీకి గురైన/తప్పిపోయిన ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించడంలో దేశవ్యాప్తంగా తెలంగాణ మరోసారి మొదటి స్థానంలో నిలిచిందని సీఈఐఆర్ సూపర్ యూజర్, సీఐడీ ఏడీజీ మహేశ్ భగవత్ వెల్లడించారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. దేశవ్యాప్తంగా 33.71 శాతం రికవరీ రేటుతో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నదని చెప్పారు. తర్వాతి స్థానాల్లో కర్ణాటక (32.09 శాతం), ఆంధ్రప్రదేశ్ (30.01 శాతం) ఉన్నట్టు తెలిపారు. ఏప్రిల్ 19వ తేదీ నుంచి శనివారం వరకు 239 రోజుల్లో 15,024 ఫోన్లను బాధితులకు అప్పగించినట్టు వెల్లడించారు. ఈ సందర్భంగా మహేశ్ భగవత్ బృందాన్ని డీజీపీ రవిగుప్తా అభినందించారు. మొబైల్ దొంగతనం, నకిలీ మొబైల్ పరికరాలను అరికట్టడానికి డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్.. సీఈఐఆర్ పోర్టల్‌ను అభివృద్ధి చేసింది. దీని ద్వారా తెలంగాణలోని 780 పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు స్వీకరించి, ఫోన్లను కనుగొంటున్నారు. తెలంగాణలో అత్యధికంగా హైదరాబాద్ కమిషనరేట్ 1,790 ఫోన్ల రికవరీతో మొదటి స్థానంలో ఉండగా సైబరాబాద్ కమిషనరేట్ 1,488 ఫోన్ల రికవరీతో నిలిచినట్టు చెప్పారు. తన బృందంలో చురుగ్గా పనిచేస్తున్న వారికి ఏడీజీ మహేశ్ భగవత్ శుభాకాంక్షలు తెలిపారు.

శేరిలింగంపల్లి మదీనాగూడలోని విశ్వ పెట్ క్లినిక్‌లో సందడి చేస్తున్న శునకం

ఈ శునకం ధర 20 కోట్లు!

విశ్వ పెట్ క్లినిక్‌లో సెలబ్రిటీ కుక్క సందడి

కొండాపూర్, డిసెంబర్ 16: అంతర్జాతీయ సెలబ్రిటీలతో సమానంగా పేరు ప్రఖ్యాతలు సంపాదించిన హైడర్ (సెలబ్రిటీ కుక్క) శనివారం శేరిలింగంపల్లి మదీనాగూడలోని విశ్వ పెట్ క్లినిక్‌లో సందడి చేసింది. బెంగళూరుకు చెందిన అంతర్జాతీయ సెలబ్రిటీ డాగ్ బ్రీడర్ సతీశ్.. కెడాబోమ్స్ రష్యాకు చెందిన కొకేషన్ షెపర్డ్ జాతి కుక్క (కెడాబోమ్స్ హైడర్)తో కలిసి పెట్ క్లినిక్‌ను సందర్శించారు. హైడర్‌ను రూ.20 కోట్లకు కొనుగోలు చేసినట్టు, ప్రస్తుతం సినీ తారలతో సమానంగా పేరు ప్రఖ్యాతలు సంపాదించినట్టు సతీశ్ తెలిపారు. సినిమాల్లో ప్రత్యేక పాత్రలు, అంతర్జాతీయంగా సెలబ్రిటీగా హైడర్ కొనసాగుతుందని చెప్పారు. పలు ఫ్యాషన్ షోలలో సైతం పాల్గొనాలని ఆహ్వానాలు వస్తున్నాయని పేర్కొన్నారు. ఈ డాగ్‌కు ప్రతి రోజు 3 కిలోల మా